thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

**మంధాన మరో మైలురాయి..**



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 157 | జగిత్యాల శుక్రవారం 11 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఢిల్లీలో బ్రిక్స్ మహాసదస్సు

- 12, 13 తేదీల్లో భారత్ మండపం వేదిక
- పుతిన్, జిన్‌పింగ్ సహా అగ్రనేతల రాక
- నాలుగోసారి బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత




.. వివరాలు 4లో

## మోదీతో ప్రిన్స్ రహీమ్ ఖాన్ భేటీ

- అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ
- ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి
- మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం
- ఇమామ్‌గా బాధ్యతల తర్వాత తొలి భారత పర్యటన

4



## బాలికను బెదిరిస్తే సహించం

- బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్
- సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ
- స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, అదనపు సెక్షన్లు

4



# సభను అడ్డుకునేందుకు ఫామ్‌హౌస్‌లోనే కుట్ర



### మూడు రోజులు సభను సాగనివ్వలేదని ఆరోపణ
### ప్రజాప్రతినిధులు, అధికారులను దూషించారని విమర్శ
### దళితులు నడిచిన నేలను శుద్ధి చేశారని మండిపాటు
### వరుస ఘటనలపై విచారణ చేపట్టామన్న సీఎం
### సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలకు రేవంత్ దిశానిర్దేశం

**ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశమై, శాసనసభను సజావుగా సాగనివ్వకుండా కుట్ర పన్నిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో సీఎం ప్రసంగించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే సభ నిర్వహణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అయితే, అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులను, పోలీసు అధికారులను దూషిస్తూ వరుసగా మూడు రోజుల పాటు సభను అడ్డుకున్నారని విమర్శించారు.**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై అసెంబ్లీని సజావుగా జరగనివ్వకుండా కుట్ర చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే అసెంబ్లీ సమావేశాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే అధికారం కోల్పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నేతలు మూడు రోజుల పాటు సభ సజావుగా సాగకుండా అడ్డుకున్నారని విమర్శించారు. గురువారం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులను దూషించడంతో పాటు అధికారుల

మిగతా 2 లో




# కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారు

### నిబంధనలకు విరుద్ధంగా ఐదెకరాల కేటాయింపు: కేటీఆర్
### ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపణ
### బినామీ కంపెనీల కోసమే సీఎం పనిచేస్తున్నారని విమర్శ
### సమగ్ర విచారణకు ఈడీ, సీబీఐ, ఐటీని రంగంలోకి దించాలని డిమాండ్
### ఫ్యూచర్ సిటీ భూముల పరిశీలన.. తుక్కుగూడలో బీఆర్ఎస్ నిరసన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సోదరుడు కొండల్‌రెడ్డికి చెందినదిగా ఆరోపిస్తున్న షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూకేటాయింపును అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీలో టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను గురువారం హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు.

2




# ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్!



- మూడు రోజుల పరిణామాలపై సర్వే చేయించామన్న సీఎం
- ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని వెల్లడి
- బీఆర్ఎస్ తీరునే ప్రజలు తప్పుబట్టారని వ్యాఖ్య

రాష్ట్రంలో గత 3 రోజులుగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనల విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత కంటే బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు ఎక్కువగా తప్పుబట్టారని సర్వేలో తేలినట్లు పేర్కొన్నారు.

2

# హైవే జాప్యంపై సిగ్గుపడుతున్నా.. ప్రారంభోత్సవానికి రాను!

### ముంబై-గోవా పనులపై గడ్కరీ అసహనం
### నాసిరకం పనులు సహించేది లేదని హెచ్చరిక



ముంబై-గోవా హైవే విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం పట్ల తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. అందుకే ఆ రహదారి ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని ముందుగానే ప్రకటించారు.

4



# నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు.

2

# ఆర్టీసీ బస్సు బీభత్సం

- పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు
- బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి..
- రెండు కార్లు, ఆటో ధ్వంసం
- డీజిల్ పంపును ఢీకొట్టడంతో కలకలం




2



# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం
- రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

2



# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

**మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం**

**పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు**

**తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం**

**రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని తెలిపారు.

# ఆర్టీసీ బస్సు బీభత్సం..

**పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు**

**ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు అక్కడ నిలిపి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. బస్సు బంకులోకి వెళ్లే క్రమంలో రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టింది. అంతేకాకుండా డీజిల్ పంపునకు కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది. బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన మొత్తం ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైంది. ప్రస్తుతం ఈ దృశ్యాలు బయటకు రావడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# 'సభను అడ్డుకునేందుకు ఫామ్‌హౌస్‌లోనే కుట్ర'

మొదటి పేజీ తరువాయి



పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా అధికారుల ఎదుట టీషర్టులు విప్పి ఇబ్బందికరంగా ప్రవర్తించారని, శాసనసభాపతిపై అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే.. దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని సీఎం ఆరోపించారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసిన కాంగ్రెస్ సభ్యులను అభినందిస్తున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా చోటుచేసుకున్న సంఘటనలపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో జరిగే చర్చల్లో పాల్గొనాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని స్పష్టం చేశారు. తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని చెప్పారు. ప్రజలు ఇచ్చిన హోదాను సక్రమంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించడం కష్టమని హెచ్చరించారు. సభ్యులందరికీ వెసులుబాటుగా ఉండాలనే ఉద్దేశంతో చారిత్రక భవనంలో శాసనమండలిని నిర్వహిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దానికి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగిన నేతలే ఇప్పుడు కాంగ్రెస్‌కు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి కనిపించినట్లున్నారని, అందుకే అంత ఆక్రోశంతో అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణ సాధించిన ఘనత అని చెప్పారు. తెలంగాణ నమూనాలోనే దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నేతలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. నేతల ప్రతి చర్య, వ్యక్తిగత పనితీరు రెండోసారి గెలుపోటములపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేలితే.. ఓటర్ల జాబితాలో మాత్రం 88 కోట్ల మందే ఉన్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉంది" అని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని పార్టీ ఎమ్మెల్యేలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకునేందుకు సహకరించిన ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సభ్యుల సహకారంతో దేశంలో మరెక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొచ్చామని గుర్తుచేశారు. వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

# ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్!

**మూడు రోజుల పరిణామాలపై సర్వే చేయించామన్న సీఎం**

**ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని వెల్లడి**

**బీఆర్ఎస్ తీరునే ప్రజలు తప్పుబట్టారని వ్యాఖ్య**

**'హరీశ్ భూముల చిట్టా బయటపెడతాం'**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** రాష్ట్రంలో గత మూడు రోజులుగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనల విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత కంటే బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు ఎక్కువగా తప్పుబట్టారని సర్వేలో తేలినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ భారీగా పడిపోయిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

**మూడు రోజుల పరిణామాలపై సర్వే**

సెప్టెంబర్ 7న అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసినట్లు చెబుతున్న అభ్యంతరకర వ్యాఖ్యలు, ఎర్రవల్లిలో జరిగిన శుద్ధీకరణ కార్యక్రమం తదితర అంశాలను సీఎం ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని, బీఆర్ఎస్ నేతల తీరుపైనే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైనట్లు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్షం సభను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని ఆరోపించారు.

**'ఓటు హక్కును కాపాడాలి'**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

**'హరీశ్ భూముల చిట్టా బయటపెడతాం'**

22ఏ భూముల అంశంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ధరణి వ్యవస్థలో హరీశ్‌రావు రాయించుకున్నట్లు ఆరోపిస్తున్న భూముల వివరాలను బయటపెడతామని ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన పూర్తి చిట్టా సిద్ధంగా ఉందని పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ పరిణామాలను రాజకీయంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ వెయ్యి రోజుల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**రూ.5 లక్షల ఉచిత సాయం.. దేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అమలు**

**రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

**హైదరాబాద్‌లో బోనాల పండుగ నాటికి 'ఇందిరమ్మ టవర్స్' గృహప్రవేశాలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం శాసనసభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్ర సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30 నుంచి 40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని తేల్చిచెప్పారు. ఎకరం రూ.150 నుంచి రూ.200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో సైతం పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఎంపిక విధానంలో డ్రా ద్వారా పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా ఇళ్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలోనే పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఉచిత ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లకు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు రూ.5,500 కోట్లు చొప్పున.. మొత్తం 8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై రూ.40 వేల కోట్లకు పైగా భారం పడుతున్నా వెనకడుగు వేసేది లేదన్నారు. రాబోయే రోజుల్లో మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను విస్తరిస్తామని చెప్పారు. దశాబ్దాలుగా గుడిసెల్లో నివసిస్తున్న పేదల కోసం రెండో విడతలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు ప్రకటన చేశారు. అలాగే హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు వీలుగా లబ్ధిదారులకు రాయితీ ధరలకే సిమెంట్, స్టీల్ అందించేందుకు ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి తెలిపారు. మార్కెట్‌లో రూ.310–320 ఉన్న 50 కేజీల సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా కంపెనీలతో ఒప్పందం పూర్తయిందని వెల్లడించారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రూ.లక్ష ముందస్తుగా అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు కూడా కల్పించామన్నారు. గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.600 కోట్లు ఖర్చు చేయడమే కాకుండా, పాత బకాయిల కోసం రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని సభకు తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న పాత ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు.

# హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

**796.28 ఎకరాల సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్**

**శంషాబాద్ సమీపంలో సమీకృత రవాణా కేంద్రం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** తెలంగాణ రవాణా రంగాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శ్రీకారం చుట్టిన ప్రతిష్ఠాత్మక బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు తొలి అడుగు పడింది. హైదరాబాద్‌ను దేశంలోనే ప్రముఖ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 'ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్' (సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. శంషాబాద్–తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ వద్ద 796.28 ఎకరాల భూమిని సేకరించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ స్థలంలో 750 ఎకరాల ప్రభుత్వ భూమి, 46.28 ఎకరాల ప్రైవేటు పట్టా భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన దృష్ట్యా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా సదరు భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా అభివృద్ధి పనులు చేపట్టకూడదని రెవెన్యూ శాఖ స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఈ హబ్‌ను నిర్మించడం వల్ల విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలుకలుగుతుంది. బహదూర్‌గూడ కేంద్రీకృతంగా హైదరాబాద్–ముంబయి, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై (వయా అమరావతి) మార్గాల్లో మూడు ప్రధాన హైస్పీడ్ కారిడార్లు రూపుదిద్దుకోనుండగా, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఆయా నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

చురకలు



# కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారు

- నిబంధనలకు విరుద్ధంగా ఐదెకరాల కేటాయింపు: కేటీఆర్
- ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపణ
- బినామీ కంపెనీల కోసమే సీఎం పనిచేస్తున్నారని విమర్శ
- సమగ్ర విచారణకు ఈడీ, సీబీఐ, ఐటీని రంగంలోకి దించాలని డిమాండ్
- ఫ్యూచర్ సిటీ భూముల పరిశీలన.. తుక్కుగూడలో బీఆర్ఎస్ నిరసన



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

- ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది
- ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు
- సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి
- సిఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం
- నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని సిఎం
- ఇలాంటి ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా..
- రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..
- మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.

# అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

### తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.





# కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక

### సాగు ప్రోత్సాహకానికి రూ.125 కోట్లకు పైగా కేటాయింపులు

### శంషాబాద్ సమీపంలో 170 ఎకరాల్లో కోహెడ మార్కెట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచి, రాష్ట్రాన్ని కూరగాయల ఎగుమతి స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గతంలో 3 లక్షల ఎకరాల్లో ఉన్న కూరగాయల సాగు ప్రస్తుతం లక్ష ఎకరాలకు తగ్గిందని, దీనివల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వివరించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత వానాకాలంలో లక్ష ఎకరాలు, రబీలో మరో లక్ష ఎకరాల్లో సాగు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. నారు, మల్చింగ్, షేడ్‌నెట్లు, శాశ్వత పందిళ్లు మరియు బిందు సేద్యం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.125 కోట్లకు పైగా రాయితీలు కేటాయించినట్లు వెల్లడించారు. రైతులకు అదనపు ఆదాయం అందించేందుకు ఆయిల్‌పామ్ తోటల్లో అల్లం, కంది, కూరగాయల వంటి అంతర పంటలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పంటల నిల్వ, ఎగుమతుల కోసం విమానాశ్రయం సమీపంలో 170 ఎకరాల్లో భారీ 'కోహెడ మార్కెట్' ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, రాబోయే రెండు మూడేళ్లలో దీన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మరోవైపు వ్యవసాయ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించని 6 ప్రైవేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల గుర్తింపును రద్దు చేశామని స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా హుజూర్ నగర్, డిచ్‌పల్లి, వికారాబాద్‌లలో కొత్త వ్యవసాయ కళాశాలలను మంజూరు చేసి, సీట్ల సామర్థ్యాన్ని 1,100 నుంచి 2,000కు పెంచామని మంత్రి సభకు వివరించారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

### గ్రామ పంచాయతీల సొంత నిధులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ

### ట్రెజరీ విధానానికి స్వస్తి పలుకుతూ సెక్షన్ 70(3)కి సవరణ

### చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** గ్రామ పంచాయతీలకు సొంత వనరుల ద్వారా సమకూరే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018 లోని సెక్షన్ 70(3) సవరణ బిల్లుకు శాసనసభ గురువారం ఆమోదముద్ర వేసింది. ఈ చట్ట సవరణ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, సభ సమగ్రంగా చర్చించి ఆమోదించింది. ప్రస్తుతం సొంత నిధులను ట్రెజరీలో వేయడం వల్ల అవసరమైనప్పుడు డ్రా చేసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధుల మాదిరిగానే జీపీ సొంత రాబడిని కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా నిధుల లభ్యత సులువవుతుందని మంత్రి తెలిపారు. సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తోందని, సర్పంచ్‌లకు పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఎలాంటి నిధుల బాకీలు లేవని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.700 కోట్ల వరకు పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదలవుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విబి-జి రామ్ జి (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ - (గ్రామీణ్) పథకం ద్వారా రూ.2,000 కోట్ల వరకు అదనపు భారం పడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా నిధులు కేటాయిస్తోందని వివరించారు. ఈ చర్చలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొని విలువైన సూచనలు అందించారు.

# ఉద్యోగుల పక్షాన ఉంటా..

### సమస్యలపై సీఎంతో జేపీసీ చర్చలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 ::** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## సంపాదకీయం



# ప్రైవేటీకరణకే మొగ్గు?

**ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనలు**

**అంతరిక్ష రంగంలో పెరుగుతున్న ప్రైవేట్ భాగస్వామ్యం**

**కీలక కార్యకలాపాల బదిలీపై సందేహాలు**

**ఇస్రో కేంద్ర పాత్ర దెబ్బతినకూడదనే ఆందోళన**

**పరిశోధన, వ్యూహాత్మక నియంత్రణ ప్రభుత్వానిదే కావాలి**

**ప్రైవేట్ పెట్టుబడులు అవసరమే.. ఇస్రోను బలిపెట్టొద్దు**

అంతరిక్ష పరిశోధనలో భారత్‌ను ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపిన సంస్థ ఇస్రో. పరిమిత వనరులతోనే అసాధారణ విజయాలు సాధిస్తూ దేశ శాస్త్రసాంకేతిక సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. చంద్రయాన్ నుంచి మంగళయాన్ వరకు, ఉపగ్రహ ప్రయోగాల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాంటి ఇస్రో భవిష్యత్తు ఇప్పుడు కొత్త చర్చకు కేంద్రబిందువుగా మారుతోంది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలకు పెరుగుతున్న అవకాశాలతో.. ఇస్రోను కూడా క్రమంగా ప్రైవేటీకరణ వైపు నడిపిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని చెబుతున్నప్పటికీ, అంతరిక్ష రంగంలో అమలవుతున్న విధాన మార్పులపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, ప్రయోగ సేవలు వంటి కార్యకలాపాల్లో ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు కల్పిస్తున్నారు. ఒకప్పుడు ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిన అంతరిక్ష రంగంలో ఇప్పుడు ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకున్నాయి.

### ప్రైవేట్ భాగస్వామ్యం తప్పు కాదు.. కానీ!

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతోంది. కొత్త పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు, వేగవంతమైన ఆవిష్కరణలకు ప్రైవేట్ రంగం దోహదపడగలదు. అయితే భాగస్వామ్యానికి, ప్రభుత్వ సంస్థ కేంద్ర పాత్రను బలహీనపరచడానికి మధ్య స్పష్టమైన గీత ఉండాలి. అమెరికాలో నాసా ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నప్పటికీ కీలక పరిశోధనలు, అంతరిక్ష కార్యక్రమాల దిశానిర్దేశంలో తన ప్రధాన పాత్రను కొనసాగిస్తోంది. భారత్‌లోనూ ఇస్రో విషయంలో అదే సూత్రాన్ని పాటించాల్సిన అవసరం ఉంది.

### కొత్త వ్యవస్థలు.. కొత్త సందేహాలు


అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇన్-స్పేస్, వాణిజ్య కార్యకలాపాల కోసం ఎన్ఎస్ఐఎల్ వంటి వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా ప్రైవేట్ రంగానికి అవకాశాలు విస్తరించడం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు ఉపయోగపడవచ్చు. అదే సమయంలో ఇస్రో పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలు మరింత బలోపేతం కావాలి తప్ప తగ్గకూడదు. ప్రైవేట్ సంస్థలకు ఏ కార్యకలాపాలు అప్పగిస్తారు? ఇస్రో వద్ద ఏ వ్యూహాత్మక బాధ్యతలు కొనసాగుతాయి? సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి హద్దులేమిటి? జాతీయ భద్రతకు సంబంధించిన అంతరిక్ష వ్యవస్థలపై నియంత్రణ ఎవరి చేతుల్లో ఉంటుంది? వంటి అంశాల్లో పూర్తి పారదర్శకత అవసరం. ఇస్రో అంటే కేవలం రాకెట్లు, ప్రయోగ కేంద్రాలు, ఉపగ్రహాలు మాత్రమే కాదు. దశాబ్దాలుగా దేశం నిర్మించుకున్న శాస్త్రీయ విజ్ఞానం, అనుభవం, వేలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల మేధోసంపత్తి దాని అసలు బలం. ఆ మానవ వనరులను కాపాడుకోవడం అత్యంత కీలకం. ప్రైవేట్ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు బయటకు వెళ్లకుండా ఇస్రోలో పరిశోధనకు మరింత స్వేచ్ఛ, తగిన ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ సంస్థను బలహీనపరిచి ప్రైవేట్ రంగాన్ని బలోపేతం చేయడం కాకుండా.. రెండింటి సామర్థ్యాలు దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానమే అవసరం. భారత అంతరిక్ష మార్కెట్ విస్తరిస్తున్న కొద్దీ దేశీయ, అంతర్జాతీయ ప్రైవేట్ సంస్థలు సహజంగానే ఆసక్తి చూపుతాయి. ఇందులో తప్పేమీ లేదు. కానీ కొద్దిమంది పెద్ద కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే అవకాశాలు కేంద్రీకృతమయ్యే పరిస్థితి ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. స్టార్టప్‌లు, చిన్న, మధ్యతరహా సాంకేతిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ నిధులతో దశాబ్దాలుగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీలో ప్రజా ప్రయోజనమే ప్రధాన ప్రమాణంగా ఉండాలి.

### ఇస్రో కేంద్ర పాత్ర చెక్కుచెదరకూడదు

అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ పెట్టుబడులకు తెరవడం ఒక విధాన నిర్ణయం. దాన్ని నేరుగా 'ఇస్రో ప్రైవేటీకరణ'గా పేర్కొనడం సరైంది కాదు. అదే సమయంలో ప్రైవేట్ రంగ విస్తరణ పేరుతో ఇస్రో పరిశోధన సామర్థ్యం, స్వతంత్రత, వ్యూహాత్మక ప్రాధాన్యం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. భవిష్యత్తు అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రైవేట్ సంస్థలకు స్థానం ఉండాలి. కానీ పరిశోధన, ఆవిష్కరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన వ్యూహాత్మక దిశానిర్దేశంలో ఇస్రోనే కేంద్రంగా కొనసాగాలి. ప్రైవేట్ సంస్థలు పోటీదారులుగా కాకుండా దేశ అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచే భాగస్వాములుగా ఎదగాలి. ప్రైవేట్ పెట్టుబడులు రావాలి.. అంతరిక్ష రంగం విస్తరించాలి.. కొత్త ఉద్యోగాలు పుట్టాలి.. భారత కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడాలి. కానీ ఆ ప్రయాణంలో దేశం దశాబ్దాలుగా నిర్మించుకున్న ఇస్రోను బలహీనపరిచే పరిస్థితి మాత్రం రాకూడదు. ఇస్రోను ప్రైవేటీకరించాలన్న ఆలోచన ఏ దశలోనైనా ఉంటే దానిని విరమించుకోవాలి. ఎందుకంటే ఇస్రో ఒక సంస్థ మాత్రమే కాదు.. భారత శాస్త్రీయ స్వావలంబనకు ప్రతీక.

# మోదీతో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ భేటీ

- అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ
- ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి
- మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం
- ఇమామ్‌గా బాధ్యతల తర్వాత తొలి భారత పర్యటన
- సెప్టెంబర్ 15 వరకు పలు నగరాల్లో పర్యటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 ::** భారత పర్యటనలో ఉన్న షియా ఇస్మాయిలీ ముస్లింల 50వ ఆధ్యాత్మిక నాయకుడు, ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్మన్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, యువత, మహిళా సాధికారత తదితర రంగాల్లో భారత్-ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు చర్చించారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయన తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 అభివృద్ధి రంగంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మహిళలు, యువత సాధికారత రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే మార్గాలపై చర్చించినట్లు వెల్లడించారు. ఇస్మాయిలీ సమాజం 50వ ఇమామ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రిన్స్ రహీమ్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సమావేశం కానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15 వరకు కొనసాగనున్న పర్యటనలో ప్రిన్స్ రహీమ్ ఢిల్లీతో పాటు అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్‌ను సందర్శించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక, వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. భారత్, ఆగా ఖాన్ సంస్థల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి భాగస్వామ్యాన్ని ప్రిన్స్ రహీమ్ పర్యటన మరింత ముందుకు తీసుకెళ్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

# 'బాలికను బెదిరిస్తే సహించేది లేదు'

**బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్**

**సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ**

**స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, దాడి ఆరోపణలు**

**ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అదనపు సెక్షన్లు**





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 ::** గత జూలైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల్లో పాల్గొన్న 14 ఏళ్ల బాలికపై నమోదైన వేధింపుల ఆరోపణల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్న సమయంలో బాధిత బాలికను గానీ, ఆమె కుటుంబ సభ్యులను గానీ బెదిరించేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధితురాలిని లేదా ఆమె కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. గురువారం ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలను కొనసాగించకుండా బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని బెదిరించే పరిస్థితి ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. బాలిక తరపు న్యాయవాది కోర్టుకు పలు అంశాలను వివరించారు. రైట్ వింగ్ కార్యకర్త స్వతంత్ర భరద్వాజ్‌పై కేసు నమోదైన తర్వాత బాలికను వేధించడంతో పాటు ఆమె ఇంటిని కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. సీజేపీ నిరసన సందర్భంగా బాలిక తండ్రిపైనా దాడి జరిగిందని కోర్టుకు తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కేసు విచారణకు ఉన్నతస్థాయి కమిటీకి కొంత సమయం పట్టే అవకాశం ఉందని, ఈలోగా బాలికకు ఏదైనా జరిగితే ఆ నష్టాన్ని భర్తీ చేయడం అసాధ్యమని న్యాయవాది వాదించారు. ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం.. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే అది అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాలను తేలిగ్గా తీసుకోలేమని స్పష్టం చేసింది. బాలికపై హింసకు సంబంధించిన అంశాల్లో ఎవరినీ రక్షించకూడదని పేర్కొంది.

### భరద్వాజ్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సెక్షన్లు


స్వతంత్ర భరద్వాజ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని నిబంధనలతో పాటు నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన సెక్షన్లను ఢిల్లీ పోలీసులు సెప్టెంబర్ 5న చేర్చినట్లు సమాచారం. బాలిక తండ్రిపై దాడి చేసినట్లు భరద్వాజ్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారని, రాజకీయ ప్రోత్బలంతోనే అరెస్టు నుంచి తప్పించుకున్నానని చెప్పినట్లు వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదమైంది. ఈ పరిణామాల అనంతరం స్వతంత్ర భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన జరిగినట్లు తెలుస్తోంది. భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే పోలీసులు స్వతంత్ర భరద్వాజ్‌ను బులంద్‌షహర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో బాధిత కుటుంబాన్ని బెదిరించే చర్యలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తామని ధర్మాసనం తేల్చిచెప్పింది.

# ఢిల్లీలో బ్రిక్స్ మహాసదస్సు

**12, 13 తేదీల్లో భారత్ మండపం వేదిక ■ పుతిన్, జిన్‌పింగ్ సహా అగ్రనేతల రాక**

**15 వేల మంది పోలీసులతో భారీ భద్రత ■ నాలుగోసారి బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 ::** ప్రపంచ అగ్రనేతలు ఒకే వేదికపైకి రానున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వసన్నద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 18వ బ్రిక్స్ సదస్సుకు ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సదస్సుకు వేదికైన భారత్ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం దృశ్యాలను షేర్ చేస్తూ.. "బ్రిక్స్--2026కు సర్వం సిద్ధం" అని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో పాటు పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా సదస్సుకు హాజరుకానున్నట్లు సమాచారం. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. 'మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం' అనే దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలు, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై నేతలు విస్తృతంగా చర్చించనున్నారు. ప్రపంచ నేతల రాక నేపథ్యంలో ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఢిల్లీ పోలీసులతో పాటు ఇతర భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. దాదాపు 15 వేల మంది పోలీసు సిబ్బందితో పాటు 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించినట్లు సమాచారం. వీవీఐపీల రాకపోకల నేపథ్యంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాల్లో భారత్ ఒకటి. 2012, 2016, 2021లో కూటమికి అధ్యక్షత వహించిన భారత్.. 2026లో నాలుగోసారి బాధ్యతలు చేపట్టింది. ఈ ఏడాదితో బ్రిక్స్ ప్రస్థానానికి 20 ఏళ్లు పూర్తవుతుండటం మరో విశేషం. జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నతస్థాయి కార్యక్రమాలను నిర్వహించి బ్రిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ప్రపంచంలోని కీలక దేశాల అధినేతలు ఢిల్లీకి తరలిరానుండటంతో రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించనుంది.








# హైవే జాప్యంపై సిగ్గుపడుతున్నా.. ప్రారంభోత్సవానికి రాను!

**ముంబై-గోవా పనులపై గడ్కరీ అసహనం**

**నాసిరకం పనులను సహించేది లేదని హెచ్చరిక**

**పనాజీ, సెప్టెంబర్ 10 ::** ముంబై-గోవా హైవే విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం పట్ల తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. అందుకే ఆ రహదారి ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని ముందుగానే ప్రకటించారు. గోవా రాజధాని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద నిర్మించిన ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను గడ్కరీ గురువారం ప్రారంభించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి దిగంబర్ కామత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ ముంబై--గోవా హైవే విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ముంబై-గోవా హైవే పనులు ఇంత ఆలస్యం కావడం నాకు సిగ్గుగా అనిపించింది. అందుకే దాని ప్రారంభోత్సవానికి నేను రానని ముందే ప్రకటిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులను ఇకపై ఉపేక్షించబోమని గడ్కరీ హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. "ఒక సంవత్సరంలోనే అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి చర్యలు తీసుకుంటా. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి ఒక రికార్డు సృష్టించాలనుకుంటున్నా. ఇక దీన్ని ఆపబోను" అంటూ గడ్కరీ ఘాటుగా హెచ్చరించారు. ముంబై--గోవా హైవే నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానని గడ్కరీ ప్రకటించారు.

చురకలు



## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :**
తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారి శ్రీకాంత్, జూనియర్ అకౌంటెంట్ అధికారి వెంకట్రావు పాల్గొని చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లేశం గౌడ్ కు సన్మానం



**తొగుట, సెప్టెంబర్ 10, :**
తొగుట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి మల్లేశం గౌడ్ వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేటలో స్థిరపడి ఇటీవల సర్పంచిగా ఎన్నికయ్యారు. కాగా లింగాపూర్ గ్రామానికి వచ్చిన మల్లేశం గౌడ్ ను స్థానిక గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా సన్మానించారు. జీవితంలో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశీర్వాదం అందజేశారు. తమ గ్రామానికి చెందిన మల్లేశం గౌడ్ యశ్వంతరావు పేటలో స్థిరపడి సర్పంచ్ గా గెలుపొందడం పట్ల గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి పదవులను మరిన్ని వరించాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. సర్పంచ్ గా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాలలో పాలు పంచుకొని మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు అలువాల కృష్ణ గౌడ్, చేపూరి సత్యనారాయణ గౌడ్, చేపూరి కిష్టా గౌడ్, చేపూరి చంద్రం గౌడ్, చేపూరి ఎల్లాగౌడ్, చేపూరి మల్లేశం గౌడ్, చేపూరి బాలకృష్ణ గౌడ్, చేపూరి మురళి గౌడ్, చేపూరి వెంకటసాయిలు గౌడ్, చేపూరి చంద్రమౌళి గౌడ్, కొండ మల్లేశం గౌడ్, కొండ చిన్న మల్లేశం గౌడ్, కొండ రామచంద్రం గౌడ్, కొండ స్వామి గౌడ్, బండారు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి సులోచన మృతి

- అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలు..
- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచన బుధవారం ఉదయం పరమపదించారు. విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాచుపల్లిలోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ మంత్రి ఏనుగుల పెద్ది రెడ్డి, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, అంబర్‌పేట్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. రోహిన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ మిథున్ రెడ్డి, స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివకుమార్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మహాదేవ్ పురం అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి తదితరులు సులోచన పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్ర, అంతిమ సంస్కారాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అశ్రునయనాల మధ్య సులోచనకు తుది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

## దళితులను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి

- రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుల ఫిర్యాదు



**నంగునూరు, సెప్టెంబర్ 10, :**
శుద్దీకరణ పేరుతో దళితులను అవమానించేలా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళితులు చేపట్టిన ఆందోళనలో భాగంగా కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్లారు. అనంతరం వారు ప్రయాణించిన రహదారులపై బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. దళితులపై వివక్ష, అవమానకర చర్యలను సహించబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తప్పెట శంకర్ సూచనలతో నంగునూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాగుల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రాగుల కనకయ్య ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాత్రి తిరుపతి, అచ్చిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే స్మార్ట్ రేషన్ కార్డు

- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :**
అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని 43వ వార్డులో మాజీ కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పూజల హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులు పొందడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ఏ ఒక్క నిరుపేద కుటుంబం సంక్షేమానికి దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, బొమ్మల యాదగిరి, డీసీసీ



మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి , వాహబ్, ఏరాబోలు రాజిరెడ్డి, అంబటి మహేష్, వార్డు కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# 'సర్' నోటీసుల విచారణ పకడ్బందీగా నిర్వహించాలి

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :**
సర్ నోటీసులపై విచారణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న సర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి



గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నోటీసుల జారీ, విచారణ విధానం, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఆధారాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల అందజేత, విచారణ, ఆధారాల నమోదు తదితర ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఆర్ఓ, తహసీల్దార్ సలీం, సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, బీఎల్‌వీలు తదితరులు పాల్గొన్నారు.

# పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

- కలెక్టరేట్లో ఘన నివాళులర్పించిన కలెక్టర్ సత్య ప్రసాద్


**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 10, :**
తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం జిల్లా కలెక్టరేట్లో గురువారం జిల్లా బీసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని, వీరనారి చాకలి ఐలమ్మచిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను స్మరిస్తూ, ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మపేరిట మహిళా విశ్వవిద్యాలయం, ఏప్రిల్ 2022లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని కోఠి మహిళా కళాశాలను తెలంగాణ తొలి మహిళా విశ్వవిద్యాలయంగా ప్రకటించింది. ఆ తర్వాత 2024లో అది వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా అవతరించిందని వివరించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళలు స్ఫూర్తి



పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, డిఆర్ఓ ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు.

## కొలన్ సులోచన మృతికి సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ సంతాపం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కీ.శే. కొలన్ సులోచన బుధవారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు గురువారం కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సూరారం మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు.



## డీసిసి అధ్యక్షుడిని సన్మానించిన కమలాకర్ నేత



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 10, :**
వరంగల్ వెంకట్రామ జంక్షన్ లోని వరంగల్ జిల్లా డీసీసీ కార్యాలయం నందు గురువారం వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యదర్శి మంత్రి కమలాకర్ నేత. వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం మహిళ అధ్యక్షురాలు, సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు మంతెన సునీత పాల్గొన్నారు.

# ఒకే గ్రామం నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు

- బక్రిచెప్యాల గ్రామానికి అరుదైన గౌరవం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఒకేసారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన గందె నవీన్ కుమార్, కూరెళ్ల మురళి, జె శ్రీనివాస్‌లు ఈ ఘనతను సాధించారు. గందె నవీన్ కుమార్ తొగుట మండలం ఘణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా, కూరెళ్ల మురళి జగదేవపూర్ మండలం మాందాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్నారు. ఒకే పాఠశాల, కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, 2008 ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా ఒకేసారి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చిన్ననాటి స్నేహితులుగా కొనసాగుతున్న వీరిద్దరూ ఒకేసారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గ్రామంలో ప్రత్యేక ఆనందాన్ని నింపింది.అదేవిధంగా బక్రిచెప్యాల గ్రామానికే చెందిన జె శ్రీనివాస్ కొమురవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. వీరితో కలిపి ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఒకేసారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా బక్రిచెప్యాల గ్రామస్తులు, స్నేహితులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ముగ్గురు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కడం అభినందనీయమని పేర్కొన్నారు.

# శుద్ధీకరణకు బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలి

- టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు

**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 10, :** ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతంలో దళితులు నిరసన చేపట్టిన అనంతరం రహదారులను పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనకు బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నాగేశ్వర్‌కు ఫిర్యాదు అందజేసిన ఆయన శుద్ధీకరణకు దారితీసిన పరిస్థితులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, దళితులకు జరిగిన అవమానం, అనంతరం ఎర్రవల్లి ఫాంహౌస్ పరిసరాల్లో చేపట్టిన శుద్ధి కార్యక్రమం తదితర అంశాలను వివరించారు. బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 7న అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, ఆయన దివంగత తల్లిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని డాక్టర్ కవ్వంపల్లి ఆరోపించారు. దళిత వర్గానికి చెందిన రాజ్యాంగబద్ధమైన స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలతో దళిత సమాజం తీవ్రంగా మనస్తాపానికి గురైందన్నారు.ఈ ఘటనపై నిరసనగా 'డప్పుల దండోరా' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలతో పాటు దళితులు, దళిత సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని, ర్యాలీ శాంతియుతంగా కొనసాగిందని చెప్పారు. దళితులకు కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని పార్టీ నుంచి బహిష్కరించాలని నిరసనకారులు డిమాండ్ చేశారని తెలిపారు.

### దళితులు వెళ్లిన తర్వాత రహదారుల శుద్ధి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ ఘటనను ఖండించకపోగా, దళితులను మరింత అవమానించేలా శుద్ధి కార్యక్రమం చేపట్టారని డాక్టర్ కవ్వంపల్లి ఆరోపించారు. దళిత నిరసనకారులు ఎర్రవల్లి ఫాంహౌస్ పరిసర ప్రాంతం నుంచి వెళ్లిపోయిన అనంతరం స్థానిక బీఆర్ఎస్ నాయకులు రహదారులపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమం నిర్వహించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దళితులు నడిచిన రహదారిని అపవిత్రంగా భావించి పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళిత సమాజానికి జరిగిన ఘోర అవమానమని ఆయన అన్నారు. ఈ చర్య కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే విధంగా ఉందని ఆరోపించారు.

### సోషల్ మీడియా పోస్టుపై కూడా ఫిర్యాదు

శుద్ధి కార్యక్రమాన్ని సమర్థిస్తూ బీఆర్ఎస్ పార్టీ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు తన ఎక్స్ ఖాతాలో



పోస్టు చేసి ప్రచారం కల్పించారని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. ఆమె పోస్టులో కేసీఆర్ ఆదేశాల మేరకు దళితులు అడుగుపెట్టిన ఫాంహౌస్ పరిసర ప్రాంతం అపవిత్రం కావడంతో పసుపు నీళ్లతో శుద్ధి చేసినట్లు పేర్కొన్నారని తెలిపారు. ఆ పోస్టు ద్వారా శుద్ధి కార్యక్రమానికి కేసీఆర్ ఆదేశాలు ఉన్నట్లు వెల్లడవుతోందని డాక్టర్ కవ్వంపల్లి ఆరోపించారు. దళితులను అపవిత్రులుగా చిత్రీకరించడం, వారు నడిచిన రహదారులను శుద్ధి చేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. శుద్ధి కార్యక్రమానికి సంబంధించి సంధ్యారావుతో పాటు ఇతర బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం–1989, బీఎన్ఎస్, ఐటీ చట్టాల్లోని వర్తించే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి పోలీసులను కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డాక్టర్ కవ్వంపల్లి వెంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆరేపల్లి రాజేందర్, హైమావతి, రాష్ట్ర వైస్ చైర్మన్లు దుర్గం శేఖర్, వెంకటేశ్వర్లు, బత్తుల పరుశరాములు, చేపూరి చిరంజీవి, హైదరాబాద్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆడాల నిఖిల్, సంజయ్ తదితరులు ఉన్నారు.

# కలెక్టరేట్ కార్యలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం - అన్నవరపు నాగేంద్ర




**దమ్మపేట, సెప్టెంబర్ 10, :** దమ్మపేట మండల చాకలి కుల సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నవరపు నాగేంద్రరావు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా చైతన్యానికి ప్రతీక, ధైర్యసాహసాలకు మారుపేరు అయిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ, పేదలు మరియు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యం, పట్టుదల, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు చాకలి ఐలమ్మ వంటి మహనీయుల జీవిత చరిత్రలు ఎంతో ప్రేరణనిస్తాయని ఆయన అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ ఐలమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ, ఆమె ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని నాగేంద్రరావు తెలిపారు.

# ఊకె శిరీష దశ దిన కార్యక్రమంలో పాల్గొన్న కాకా రమేష్

**దమ్మపేట, సెప్టెంబర్ 10, :** జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైద్రాబాద్ ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో నర్సు గా పనిచేస్తూ కామాంధుడి చేతిలో కర్కశంగా బలైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం, చౌటిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన మహిళ ఊకె శిరీష దశ దిన కార్యక్రమంలో పాల్గొని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 5 ఎకరాల భూమి, కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలని జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక తరుపున జాతీయ అధ్యక్షులు కుర్సం నిరీక్షణరావు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ సెక్రటరీ మడివి ఎలీషా, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కాక రమేష్ జాషువా, అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షులు కొమరం యేసురత్నం, ములకలపల్లి మండల అధ్యక్షులు మడివి మోషే, దమ్మపేట కమిటీ సభ్యులు కోర్స జాన్ బాబు, జోసెఫ్, ఆదివాసీ నాయకులు సోయం సత్యనారాయణ, ఆరెం ప్రశాంత్, అడ్వకేట్ ఊకె రవి, రవీంద్రబాబు, మాజీ ఎంపీపీ లలిత, తాటి చిన్న వెంకటేశ్వర్లు, పద్దమ్ నగేష్, పూసం సూర్యచంద్రారావు, కుటుంబ సభ్యులు,తదితర ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



# వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



- రౌడీషీటర్లకు జగద్గిరిగుట్ట సీఐ సురేష్ హెచ్చరిక

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని జగద్గిరిగుట్ట సీఐ ఎం. సురేష్ సూచించారు. ఈ మేరకు గురువారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాలను సందర్శించిన పోలీసులు.. ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అలాగే రౌడీషీటర్లకు పలు సూచనలు చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి గొడవలు, వివాదాలకు పాల్పడినా, అవాంఛనీయ ఘటనలకు కారణమైనా ఉపేక్షించేది లేదని సీఐ సురేష్ హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను పాటిస్తూ శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించి వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 10, :** గణపతి నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవాదాయశాఖ ఆహ్వానించింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే శ్రీగణేష్, సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ, అర్చకులు ముఖ్యమంత్రిని కలిసి గణేష్ నవరాత్రోత్సవాలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం




**పటాన్చెరు, సెప్టెంబర్ 10, :** ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్డారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, వాటికి సంబంధించిన ఖర్చులు, నిధుల కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, వాటికి సంబంధించిన ఖర్చులపై చర్చించి ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కౌన్సిలర్లు పలు అంశాలను ప్రస్తావించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు.

# నకిలీ ఎక్స్ ఖాతా ఆధారంగా సభను తప్పుదోవ పట్టించారని ఆరోపణ

- రూల్ 168 కింద సీఎం రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



**పటాన్చెరు, సెప్టెంబర్ 10, :** నకిలీ ఎక్స్ ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని శాసనసభలో నిరాధార ఆరోపణలు చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ 9న అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్న నకిలీ ఎక్స్ ఖాతాలోని పోస్టును సీఎం ప్రస్తావించారని వారు ఆరోపించారు. ఈ మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కలిసి అసెంబ్లీ కార్యదర్శి రెడ్ల తిరుపతికి రూల్ 168 కింద నోటీసు అందజేశారు. బీఆర్ఎస్‌లో 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవే లేదని, నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని సభలో ప్రస్తావించడం ద్వారా సభ్యులను తప్పుదోవ పట్టించారని వారు పేర్కొన్నారు. సభా గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన సీఎంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని కోరారు.

# వీరనారి చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయ

## అడిషనల్ కలెక్టర్ పాండు



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ పక్కనగల చాకలి ఐలమ్మ విగ్రహానికి సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటానికి సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు. ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్ దరఖాస్తుదారులకు ప్రత్యేక వైద్య శిబిరాలు



**సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే దివ్యాంగులకు అవసరమైన యూడీఐడీ, సదరం ధ్రువపత్రాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సిద్దిపేట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. జీజీహెచ్ సిద్దిపేట సహకారంతో సెప్టెంబర్ 8న టీటీడీ కల్యాణ మండపంలో, సెప్టెంబర్ 10న జీజీహెచ్ సిద్దిపేటలో దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో లోకోమోటార్ వైకల్యం, చూపు లోపం, వినికిడి లోపం, మేధో వైకల్యాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు శిబిరాలకు మొత్తం 756 మంది హాజరు కావాల్సి ఉండగా, 578 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జీజీహెచ్ వైద్యులు, వైద్య సిబ్బంది, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు. చేయూత పింఛన్ నూతన దరఖాస్తుల సమాచార నమోదు కోసం సెప్టెంబర్ 15 చివరి తేదీ కావడంతో, దివ్యాంగుల యూడీఐడీ, సదరం ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అదనపు డీఆర్‌డీఓ సుధీర్ తెలిపారు. ఈ శిబిరాల ద్వారా దివ్యాంగులకు వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల ప్రక్రియ సులభతరం చేసి, అర్హులైన వారు చేయూత పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించారు.

# గజ్వేల్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స

- **డాక్టర్ రాజశేఖర్ సూపరింటెండెంట్**

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో గురువారం క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి నిరుపేదకు పునర్జన్మ అందించి, తమ ప్రతిభను చాటుకున్నారు. దీర్ఘకాలిక కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ కు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేసి ఉపశమనం కల్పించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన యాదమ్మ (46) గత రెండేళ్లుగా తీవ్రమైన రక్తస్రావం, కడుపుబ్బరం, తీవ్రమైన కడుపునొప్పి, తీవ్ర రక్తహీనతతో బాధ పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో భారీ ఖర్చుతో కూడుకున్న చికిత్స చేయించుకోలేని ఆర్థిక స్థితిలో ఆమె గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ తక్షణమే స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రోగికి అవసరమైన వైద్య పరీక్షలు, ముందస్తుగా రక్తమార్పిడి, ఎమర్జెన్సీ మందులు సమకూర్చి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. సర్జన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ మహిపాల్ సహకారంతో ఈ సంక్లిష్ట శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. పేషెంట్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నిరుపేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా అందుబాటులో ఉన్నాయని నిరూపించడంలో గజ్వేల్ జిల్లా ఆసుపత్రి ముందుంటోందని సూపరింటెండెంట్ అన్నారు. క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు, ఇతర సిబ్బందిని ఆసుపత్రి పాలకవర్గం



ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు కూడా జిల్లా కేంద్ర ఆస్పత్రి గజ్వేల్ లో జరుగుతున్నాయని ఇటువంటి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రాజశేఖర్ పిలుపు నిచ్చారు. రోగి బంధువులు డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఆర్ఎంవోలు డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, జనరల్ సర్జరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, అనస్థీషియా డాక్టర్ మైపాల్, హెడ్ నర్స్ రాంబాయమ్మ, నర్సింగ్ ఆఫీసర్ యాదమ్మ, ఓటి టెక్నీషియన్ రాజు, వెంకట్, పేషంట్ కేర్ సిబ్బంది రాజు, సంతోష, ఆరోగ్యశ్రీ సిబ్బంది సురేందర్ సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడాపోటీలలో రాణించిన గీతం విద్యార్థిని

- **పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026లో రెండు పతకాలు సాధించిన బీబీఏ తొలి ఏడాది విద్యార్థి ఆశ్రిత**

**పటాన్చెరు, సెప్టెంబర్ 10, :** వియత్నాంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026 పోటీలలో హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బీబీఏ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల రెండు పతకాలు సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు. 18 ఏళ్ల లోపు విభాగంలో పోటీపడిన ఆశ్రిత, అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, బాలికల సింగిల్స్ లో రజత పతకాన్ని, డబుల్స్ లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఒక అంతర్జాతీయ క్రీడా పోటీలలో సింగిల్స్, డబుల్స్ రెండింటి లోనూ పతకాలు సాధించడం ఒక గొప్ప ఘనత. ఇది ప్రపంచ వేదికపై రాణించాలనే ఆమె ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పానికి నిదర్శనం.ఆశ్రిత సాధించిన ఈ విజయం ఆమె కఠోర శ్రమ, నిబద్ధత, పికిల్ బాల్ పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. ఆమె విజయం, చదువుకు అతీతంగా రాణించడం, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అవకాశాలను అందిపుచ్చుకోవడం ప్రాముఖ్యతను కూడా చాటి చెబుతోంది. ఒక అంతర్జాతీయ క్రీడా కార్యక్రమంలో గీతంకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా, ఇతర రంగాలలో



రాణించాలని ఆకాక్షించే తోటి విద్యార్థులకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు.గీతం నాయకత్వం, ఆశ్రిత సాధించిన ఈ అద్భుత విజయానికి అభినందించి, ఆమె అంకితభావం, క్రీడా స్ఫూర్తి, శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రశంసించింది. ఆమె మరిన్ని విజయాలను సాధించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ప్రోత్సహించారు. వియత్నాంలో తన అద్భుతమైన ప్రదర్శనతో ఆశ్రిత వర్ధమాన యువ క్రీడాకారులకు ఒక గొప్ప ప్రమాణాన్ని నెలకొల్పింది. అంకితభావం, పట్టుదల, నిరంత కృషితో ఆశయాలను అంతర్జాతీయ వేదికపై విజయాలుగా మార్చుకోవచ్చని ఆమె ప్రస్థానం నిరూపిస్తోంది.

**గీతంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన అప్లైడ్ సైకాలజీ విభాగం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆత్మహత్యల నివారణపై బహిరంగ చర్చలను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలతో సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పాటించింది. 'ఆత్మహత్యలపై కథనాన్ని మార్చడం', 'చర్చను ప్రారంభించండి' అనే ఇతివృత్తంతో, మానసిక ఆరోగ్యంపై నెలకొన్న మౌనాన్ని ఛేదించడం, అలాగే వ్యక్తులు సహాయం కోరడానికి సౌకర్యవంతంగా భావించే సహాయక వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్య సవాళ్లు, మద్దతు, ఆశ, ఆత్మహత్యల నివారణ వంటి అంశాలను అన్వేషించే ప్రదర్శనలు, కళాకృతులు, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ చొరవ గీతం సమాజాన్ని సంభాషణలు ప్రారంభించడానికి, కళంకాన్ని సవాలు చేయడానికి, భావోద్వేగ బాధలను అనుభవిస్తున్న వారి పట్ల సానుభూతి, అవగాహనను పెంపొందించడానికి ప్రోత్సహించింది. ఈ కార్యక్రమాల ద్వారా అప్లైడ్ సైకాలజీ విభాగం ప్రాంగణం అంతటా మరింత అవేగాహన కల్పించడానికి, శ్రద్ధ, అనుబంధం, మద్దతు సంస్కృతిని ప్రోత్సహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

# దళితులను చిన్న చూపు చూస్తే సాహించేదిలేదు

- **టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్**
- **ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో మర్కుక్ పోలీస్ స్టేషన్లో బాద్యులపై పిర్యాదు**

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం మర్కుక్ పోలీస్ స్టేషన్ లో దళితులు నడిచిన నేల మైల పడిందని పసుపు నీళ్లతో శుద్ధి చేసి అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయకుమార్ మాట్లాడుతూ ఇలాంటి వారిపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, ఆలా చేస్తేనే మరోసారి ఇలాంటి చెర్యలు పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు. రాష్ట్రం లోనే కాదు ఈ దేశంలోనే దళితులను ఆత్మగౌరవంతో నిలబెట్టింది కేవలం కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అనీల్ రెడ్డి, డీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ బండమీది తిరుపతి, మర్కుక్ మండల చైర్మన్ ప్రభుదాస్, ములుగు మండల చైర్మన్ తూర్పింటి రాజు, వర్గల్ మండల చైర్మన్ మెట్టు సాయి కుమార్ ములుగు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నంద కుమార్, మహంకాళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిట్యాల ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

- **నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత: సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత, సాయుధ తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ సేవలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జగద్గిరిగుట్ట అవుట్‌పోస్ట్ సర్కిల్ చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, పార్టీ శ్రేణులతో కలిసి ఉమామహేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ.. "దున్నేవాడికే భూమి" అనే నినాదంతో, వెట్టి చాకిరీ నుంచి ప్రజల విముక్తి కోసం దొరలు, నిజాం, రజాకార్ల సైన్యాలకు ఎదురొడ్డి పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంగాల శ్రీనివాసులు, మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, గుట్ట పార్టీ శాఖ కార్యదర్శి సహదేవ రెడ్డి, నాయకులు సోమయ్య, కృష్ణ, ఇమామ్, వెంకటేష్ తదితరులు



పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి భరోసా..



- **కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చెక్కుల పంపిణీ**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని షాపూర్‌నగర్‌లో మేడ్చల్–మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రమేష్, గాయత్రి, సత్తార్, సైదారత్న, హేమలత, సంగీత, ప్రకాష్, నవత, శంకర్ తదితరులకు మంజూరైన రూ.4,20,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడంలో సీఎంఆర్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోం దన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంఆర్ఎఫ్‌కు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, బాలప్ప, యం.సాగర్, మోతే శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు ముదిరాజ్, ఆర్.వి. వెంకట్ రమణ, శ్రీరాములు, సలీం, చందు గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శంకర్ గౌడ్, చోటు, రఘు, రాజిరెడ్డి, రామగిరి రాకేష్, రిజ్వాన్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ సొసైటీలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

- **స్థానికుల సమస్యలపై స్పందించి పనులు చేపట్టిన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** సుభాష్‌నగర్ డివిజన్‌లోని శ్రీరామ సొసైటీ తార ఫంక్షన్ హాల్ గల్లీలో నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభించింది. నూతనంగా చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులను గురువారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ పరిశీలించారు. తార ఫంక్షన్ హాల్ గల్లీలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పాటు డ్రైనేజీ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్న విషయాన్ని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ స్థానికులతో కలిసి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సురేష్ రెడ్డి, కార్పొరేటర్ నిధులతో రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. తమ సమస్యను అడిగిన వెంటనే స్పందించి పరిష్కరించినందుకు కృతజ్ఞతగా స్థానిక బస్తీవాసులు సురేష్ రెడ్డి, పోలె శ్రీకాంత్‌లను బస్తీకి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- **తహసీల్దార్ కు బీజేపీ నాయకుల వినతిపత్రం**

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 10, :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని సుమారు 24 గ్రామపంచాయతీల పరిధిలో గల వందల ఎకరాల భూములను 22–ఏ జాబితాలో చేర్చడంతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం కొడిమ్యాల మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్ కు వినతిపత్రం అందజేశారు. 22–ఏ సమస్యను అధికారులు తక్షణమే పరిశీలించి అర్హత ఉన్న భూములను జాబితా నుంచి తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షైన్ మల్లేశం, మండల అధ్యక్షులు బండ నరసింహారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# సంతోషిమాత దేవాలయంలో ఘనంగా ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు

- నెల రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు
- ఐదు రోజుల పాటు వైభవంగా వార్షికోత్సవం, వరలక్ష్మీ వ్రతం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** సిద్దిపేటలోని ప్రముఖ శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రావణ మాస ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో నెల రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా వార్షికోత్సవం, వరలక్ష్మీ వ్రతాన్ని ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. నెల రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆదివారం ఆదిత్య హోమం, సోమవారం రుద్రహోమం, మంగళవారం హనుమత్ హోమం, బుధవారం గణపతి హోమం, గురువారం గాయత్రీ, సరస్వతి హోమం, శుక్రవారం లక్ష్మీ హోమం, శనివారం నవగ్రహ హోమం నిర్వహించారు. అమావాస్య రోజున సుదర్శన నారసింహ, మహాలక్ష్మి అమ్మవారి మూలమంత్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సంతోషిమాత అమ్మవారికి శతకలశ అభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాదం అందించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి ముష్టం మైసాగౌడ్ నేతృత్వంలో ప్రధాన అర్చకులు పాడిచేటి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు కలకుంట్ల రంగాచార్య, దేవాలయ మాజీ చైర్మన్లు తమ్మిశెట్టి వీరేశం, బచ్చు రమేష్, కాచం కాశినాథ్, మాంకాల నవీన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చివరి శుక్రవారం రోజున కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు పాడిచేటి రామకృష్ణమాచార్యులు, కార్యనిర్వహణాధికారి మైసాగౌడ్ తెలిపారు.

# లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

- "రాజీయే రాజమార్గం" మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాజీ పడదగిన వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ, వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. "రాజీయే రాజమార్గం" అనే భావనతో న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ ద్వారా పరిష్కారం కోరుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి చేయూత..

- వైద్య చికిత్స కోసం రూ.2.75 లక్షల విలువైన ఎల్‌ఓసీ చెక్ అందించిన ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని ప్రగతినగర్‌కు చెందిన గొల్ల అశోక్ యాదవ్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసీ) ద్వారా అశోక్ యాదవ్ వైద్య చికిత్సకు రూ.2,75,000 ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ చెక్‌ను భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి గురువారం అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయం అందేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దర్శన్ యాదవ్,



వికాస్ యాదవ్, సమ్మయ్యతో పాటు గొల్ల అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి.

- జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** గణేష్ మండప నిర్వాహకులు రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రజా జీవనానికి భంగం కలగకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. విద్యుత్ తీగలకు దగ్గరగా గణేష్ మంటపాలను నిర్మించ కుండా జాగ్రత్త పడాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా మంటపాలను ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల్లో భక్తి పాటలు మాత్రమే వేయాలని సూచించారు. హిందూ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా యూత్ పేర్లు పెట్టుకోవాలన్నారు. గణేష్ ఆగమన్ కార్యక్రమాలను ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా నిర్వహించాలని సిఐ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచన మేరకు డిఎస్పి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో "ఈనెల 12 శనివారం దేవిశ్రీ గార్డెన్ లో గణేష్ మంటప నిర్వాహకులతో సమావేశం" ఉంటుందని, ఈ సమావేశంలో మంటపాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొనాలని సిఐ కోరారు.

# సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- ఐలమ్మ ఆశయాల సాధన కోసం ప్రజా సమస్యలపై పోరాడాలి: సీపీఎం నేతలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 10 నుంచి 17వ తేదీ వరకు జయప్రదంగా నిర్వహించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం షాపూర్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కీలుకాని లక్ష్మణ్, సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనతో పాటు భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్ల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని వారు అన్నారు. ఈ పోరాటాన్ని కేవలం మతాల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పాలకవర్గాల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలను కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లింగస్వామి, నాయకులు అంజయ్య, సత్యం, స్వాతి, కరుణాకర్, శీను, తిమ్మప్ప, కనకయ్య, శ్రీశైలం, కృష్ణ, లక్ష్మీనారాయణ, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్
- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- మట్టి వినాయక విగ్రహాల అవగాహన వాల్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్




**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 10, :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి)తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్యప్రసాద్ తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. పర్యావరణహిత వినాయక చవితిని ప్రోత్సహించేందుకు 2,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజ గౌడ్ , ఎన్విరాల్మెంట్ అసిస్టెంట్ సైంటిస్ట్ మహేష్, డిఆర్డిఓ రఘువరన్, డిపిఓ మదన్మోహన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

- ఐలమ్మ విగ్రహానికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జేఏసీ రాష్ట్ర నేత బత్తుల చంద్రం ఘన నివాలి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సిద్దిపేట పట్టణంలోని ఆమె విగ్రహానికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జేఏసీ రాష్ట్ర నాయకులు బత్తుల చంద్రం, మాచవరం మహేందర్, రాజాగౌడ్, కాముని నాగేష్, ప్రభురాజ్ గంగపుత్ర, దళిత సేన రాష్ట్ర నేత బాకి చంద్ర భానులు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ఆమె సేవలను స్మరించుకున్నారు. సాయుధ పోరాటంలో భూస్వాములు, రజాకారుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ వెనుదిరగకుండా పోరాటం చేసిన గొప్ప యోధురాలని అన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించిన చాకలి ఐలమ్మ సకల జనులకు స్ఫూర్తిదాయకమని, ఆమె ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ భూపోరాటంలో ఆమె చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# 9వ రాష్ట్రీయ పోషణ్ మాసం విజయవంతంగా నిర్వహించాలి

- పోషణ్ మాసం పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 10, :** జగిత్యాల జిల్లాలో 9వ పోషణ్ మాసం – 2026 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పోషణ్ మాసం కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ చేతుల మీదుగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి 9వ పోషణ్ మాసం – 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న పోషణ్ మాసం కార్యక్రమాల్లో భాగంగా పోషణ్ మేళాలు, పోషకాహార వంటకాల ప్రదర్శనలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన, అంగన్వాడీ కేంద్రాల ద్వారా వివిధ అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పోషణ్ మాసం కార్యక్రమాలను కేవలం మహిళా శిశు సంక్షేమ శాఖకే పరిమితం చేయకుండా అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా నిర్వహించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు డిఆర్డిఓ రఘు వరన్ డీపీఓ మదన్ మోహన్, మెప్మా PD శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ సత్య ప్రణవ్, జిల్లా వైద్యాధికారి జి. సుజాత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఆడెపు భాస్కర్, సీడీపీఓ జయప్రద, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి హక్కుల కోసం పోరాటమే లక్ష్యం

- ఎన్ఎస్‌యూఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా

**రాకేష్ ముదిరాజ్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రాకేష్ ముదిరాజ్‌ను ఎన్ఎస్‌యూఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా గురువారం రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్, తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ అక్బర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని రాకేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతం చేసి, విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమాలను విస్తృతం చేస్తానని తెలిపారు.<

# సులోచనమ్మ అకాల మృతి..

## కొలన్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ ప్రముఖులు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి కీ.శే. కొలన్ సులోచనమ్మ అకాల మరణం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి చేరుకున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, మేడ్చల్–మల్కాజ్‌గిరి మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సులోచనమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వారు, కొలన్ హన్మంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సులోచనమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సులోచనమ్మకు నివాళులర్పించారు.

# పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పారునంది రాఘవేందర్



**సదాశివపేట, సెప్టెంబర్ 10, :** సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పారునంది రాఘవేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆయనకు గురువారం బాధ్యతలను అప్పగించారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి పారునంది రాఘవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని పట్టణంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాఘవేందర్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు.

# ఎస్పీ పరతోష్ పంకజ్ కు మట్టి వినాయక విగ్రహం అందజేత



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ ను బిఆర్ఎస్వి నాయకులు అఖిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని, ప్రజలు కూడా మట్టి విగ్రహాన్ని వినియోగించి పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని వారు సూచించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగంతో నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అఖిల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మట్టి వినాయక విగ్రహాన్ని స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసాద్, అడ్డా నాన్నన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమక్షంలోనే భూ రీ-సర్వే నిర్వహించాలి

- హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** భూముల రీ-సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే భూముల హద్దులు, కోఆర్డినేట్లను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. గురువారం చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన భూ భారతి-భూ సర్వే, రీ-సర్వే అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1935లో భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం 2026లో మరోసారి భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సాధారణంగా ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి భూ సర్వే నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రీ-సర్వే కోసం ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని తెలిపారు. సుమారు రూ.6-7 లక్షల విలువైన ఆధునిక రోవర్ పరికరాలను ఉపయోగించి అత్యంత ఖచ్చితత్వంతో భూములను కొలిచి హద్దులను నిర్ధారిస్తున్నట్లు చెప్పారు. భూముల కొనుగోలు, అమ్మకాల కారణంగా సర్వే నంబర్లలో ఉప నంబర్లు మారడం, పట్టాదారు ఒకరు కాగా కబ్జాలో మరొకరు ఉండటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇలాంటి సమస్యలకు రీ-సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఇందుకు రైతులు, అధికారులు సహకరించాలని కోరారు. రీ-సర్వేకు ముందు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి, ప్రతి భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన మ్యాప్‌ను ఖచ్చితమైన కోఆర్డినేట్లతో అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసీల్దార్ సలీం, సర్వే అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్
- రీ-సర్వే, నక్ష యుఎల్పి పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** నాన్ క్యాడస్ట్రల్, క్యాడస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ప్రక్రియతో పాటు నక్ష యుఎల్పి పురోగతిపై జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నాన్ క్యాడస్ట్రల్, క్యాడస్ట్రల్ గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలను సమీక్షించారు. రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన ఫీల్డ్ రిజిస్టర్లు, ప్రోగ్రెస్ వివరాలు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న సర్వే సిబ్బంది నుంచి ప్రతిరోజూ ప్రగతి వివరాలను సేకరించి, సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న స్ప్రెడ్‌షీట్‌లోని వివరాలను పూర్తిగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తాజా ప్రగతిని నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే విధంగా సర్వే కోసం అవసరమైన పరికరాలను త్వరలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత, సర్వే ఎడి కిషన్ ప్రసాద్, సంబంధిత అధికారులు, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు, సర్వే సిబ్బంది, లైసెన్స్డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# 30లోగా 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా నుంచి అందిన ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలోని 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టి, ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత ఆధ్వర్యంలో 276 చెరువుల డి-మార్కింగ్, సంబంధిత వివరాల సేకరణ, మ్యాపింగ్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 276 చెరువులకు సంబంధించి డి-మార్కింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ప్రతి చెరువుకు సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, భౌగోళిక స్థితి, సంబంధిత భూముల వివరాలను పక్కాగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఇరిగేషన్, ఫిషరీస్, రెవెన్యూ, ఫారెస్ట్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డి-మార్కింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం సేకరించిన పూర్తి సమాచారాన్ని కేఎమ్ఎల్ సంబంధిత ఫార్మాట్‌లో సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 30వ తేదీలోగా జిల్లాలోని మొత్తం 276 చెరువుల డి-మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేసి, సంబంధిత కేఎమ్ఎల్ ఫార్మాట్‌లో పూర్తి వివరాలను సమర్పించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఇరిగేషన్, ఫిషరీస్, రెవెన్యూ, ఫారెస్ట్, అగ్రికల్చర్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గురువారం కలెక్టరేట్‌లో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమై జలచరాలతో పాటు ప్రాణికోటికి హాని కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్రజలంతా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త అరవింద్ మాట్లాడుతూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణలోని 33 జిల్లాల్లో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో సుమారు 2,500 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. అంబేద్కర్ సర్కిల్ పాత బస్టాండ్ లో కూడా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ ఇంద్రానగర్ పాఠశాల, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ రాజ్‌కుమార్, పరిపాలన అధికారి, కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నర్మెటలో జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటీ ఏర్పాటు



**నంగునూరు, సెప్టెంబర్ 10, :** సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం నర్మెట గ్రామంలో గురువారం గౌడ సంఘం సభ్యుల సమక్షంలో జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. జై గౌడ్ ఉద్యమం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంధపు హరి గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమిటీలను ప్రకటించారు. జై గౌడ్ ఉద్యమం నర్మెట గ్రామ అధ్యక్షుడిగా గోనెపల్లి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోలగం నరసింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బందారం యాదగిరి గౌడ్, సహాయ కార్యదర్శిగా వడ్లకొండ రాజు గౌడ్, ప్రచార కార్యదర్శిగా బందారం నరసింహులు గౌడ్ ఎంపికయ్యారు. యువజన విభాగం అధ్యక్షుడిగా దమ్మక్కపల్లి రాజు గౌడ్, ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ పరశురాం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పరకాల ప్రశాంత్ గౌడ్, సహాయ కార్యదర్శిగా దమ్మక్కపల్లి విజయ్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్ గౌడ్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నెమలి సుభాష్ గౌడ్ (మాజీ సర్పంచ్), ముస్కిర్ పరశురాం గౌడ్, మహేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కమిటీల ఏర్పాటుకు సహకరించిన నర్మెట గ్రామ గౌడ సంఘం సభ్యులకు జై గౌడ్ ఉద్యమం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గౌడ పెద్దలను గౌరవిస్తూనే యువతకు ప్రాధాన్యత కల్పించి, గౌడ సమాజ అభివృద్ధి, ఐక్యత, రాజకీయ అవకాశాల కోసం నిరంతరం కృషి చేయాలని జై గౌడ్ ఉద్యమం నాయకత్వం నిర్ణయించింది. గౌడుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో జిల్లా అధ్యక్షులు, యువజన అధ్యక్షుల స్థాయిలో మార్పులు, చేర్పులు చేపట్టి ఉద్యమం కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు కల్పిస్తూ కొత్తవారికి అవకాశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గౌడ పెద్దలు, యువత, మహిళలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రచార విభాగాలతో ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్, మహారాష్ట్ర అధ్యక్షుడు సిల్వర్ నారాయణ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గన్నెబోయిన చంద్రం గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.జై శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్!



## శ్రోతల జీవితాలలో భాగాలు..
# బావగారి కబుర్లు
### నేడు ప్రయాగ నరసింహ శాస్త్రి వర్ధంతి

ఆకాశవాణి శ్రోతలకు చిర పరిచితులు ప్రయాగ నరసింహ శాస్త్రి. రేడియోనే ప్రధాన మనో రంజక సాధనంగా ఒకనాటి ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకున్న రోజులలో ప్రయాగ నిత్య విధి కార్యక్ర మాలు శ్రోతల జీవిత భాగస్వాములు అయినా యంటే అతిశయోక్తి కాదేమో. ఆకాశ వాణి ప్రయోక్తగా, తెలుగు సినీ నటునిగా, హరికథకులుగా, రచయితగా, గాయకునిగా ప్రయాగ నరసింహ శాస్త్రి (నవంబరు 20, 1909 – సెప్టెంబరు 11, 1983) తెలుగు ప్రజలకు రేడియో ద్వారా చిర పరిచితులు.

తన ప్రత్యేక కంఠ స్వరంతో ఖంగుమని పలుకుతూ, జానపద శైలిలో పాడుతూ శ్రోతల్ని ఉర్రూత లూగించిన వ్యక్తి శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. మూడు దశాబ్దాలు ఆకాశవాణిలో పనిచేసి ప్రశంసా పాత్రుడైన వ్యక్తి. 1936 లో ప్రయాగ ఆకాశవాణి మదరాసు కేంద్రంలో నిలయ విద్వాంసు డుగా చేరారు. ‘ బావగారి కబుర్ల ద్వారా ఆయన శ్రోతలకి చేరువయ్యారు. ఆయన, గాడేపల్లి సూర్య నారాయణతో కలిసి బావగారి కబుర్లు నిర్వహించే వారు. అవి శ్రోతల జీవనంలో భాగమై పోయాయి. “ఏమండోయ్ బావగారు రావాలి రావాలి” అనే పలకరింపులు సహజమ య్యాయి. స్క్రిప్టు లేకుండా యధాలాపంగా అనర్గళంగా తన సంభాషణలతో వినోదాన్ని అందించేవారు ప్రయాగ.

నరసింహశాస్త్రి 1909 నవంబర్ 20 న విశాఖపట్నం జిల్లా పెదగాడి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి సంగీత సాహిత్యాలపై అపారమైన ప్రీతి. విజయనగరం మహారాజా కళాశాలలో చదువు కొని పట్ట భద్రులయ్యారు. శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఆయన సహా ధ్యాయులు. హరికథా పితామ హుడు ఆదిభట్ల నారాయణ దాసు వద్ద హరికథా గానంలో మెళుకువలు నేర్చు కొన్నారు. చక్కని గాత్రము రూపము ఉన్న ప్రయాగ 1935లో చలన చిత్రరంగ ప్రవేశం చేశారు. భీష్మ చిత్రంలో విచిత్ర వీర్యుని పాత్రను పోషించారు. నాగయ్య గారి త్యాగయ్య చిత్రంలో గణపతి పాత్రను పోషించారు. అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. 1969లో ఆకాశ వాణిలో పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ నటన పై ఆసక్తి తో చిత్రరంగంలో ప్రవేశించారు. చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం వంటి సినిమాలలో నటించారు.

ఆకాశవాణి మదరాసు కేంద్రంలో 1936 నుండి రెండు దశాబ్దాలు పని చేశారు. అక్కడ వీరు ప్రసారం చేసిన మొద్దబ్బాయ్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ రికార్డు కంపెని వారు రికార్డు చేసి విడుదల చేశారు. 20కి పైగా హెచ్.ఎం.వి. రికార్డులు ఆయన విడుదల చేశారు. శ్రోతలలో వీరికంత ప్రశస్తి వుండేది. 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి బదలీ అయ్యారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, బందా కనక లింగేశ్వర రావు, బాలాంత్రపు రజనీ కాంత రావు, జరుక్ శాస్త్రి, బాల మురళి, ఓలేటి వంటి పండితుల సాహచర్యం లభించింది.

విజయవాడలో ప్రయాగ గ్రామీణ కార్యక్రమాల ప్రయోక్తగా పనిచేశారు. ఎన్నో జానపద గేయాలను పాడి, పాడించి శ్రోతల మన్ననలందు కొన్నారు. హరికథలు స్వయంగా రచించి గానం చేశారు. త్యాగరాజ చరిత్ర, కన్యాకుమారి, గాంధీజీ, శంకర విజయం హరి కథలు ప్రముఖాలు. 1962లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సమక్షంలో గాంధీజీ బుర్రకథను వినిపించి బంగారు పతకంతో సన్మానించ బడ్డారు. ఆయన వివిధ బుర్రకథలు హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డులుగా విడుదలైనాయి.



వినోదాల వీరయ్యగా విజయ వాడ కేంద్రం నుండి ఎన్నో కార్యక్రమాలు సమర్పించారు. ఆకాశవాణిని ప్రయాగకు ఆరోప్రాణంగా భావించే వారు. 1969లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన ప్రయోక్తగా ఎన్నో కార్యక్రమాలు వెలువడ్డాయి. 1970 నుండి ఐదు సంవత్సరాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ పక్షాన ‘ బాలాజీ ఆర్ట్ థియేటర్ ‘ పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. 1980 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంగీత కళా పీఠంలో యక్షగానాలు, హరికథల అధ్యాపకులుగా పని చేశారు. హిందు ధర్మ ప్రచార పరిషత్ లో జానపద కళా ప్రచారకులుగా వ్యవహరించారు. 1983 సెప్టెంబరు 11న పరమ పదించారు. మాట, పాట, ఆటలతో శ్రోతల్ని సంబరపెట్టిన ప్రయాగ నిత్యోత్సాహి. ప్రయాగ నరసింహ శాస్త్రి కుమార్తె వేదవతి ఆకాశవాణిలో నిజామాబాద్ లో అసిస్టెంట్ స్టేషను డైరక్టరుగా సుపరిచితులు. భీష్మ – విచిత్ర వీర్యుడు, త్యాగయ్య – గణపతి, చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం తదితర చిత్రాలలో ఆయన నటించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రకృతి రక్షణకు ప్రాణ త్యాగం..
# అటవీ అమరవీరుల జ్ఞాపకం

- నేడు జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం
- అడవుల కోసం ప్రాణాలర్పించిన వనరక్షకులకు వందనం
- ఖేజర్లీలో 363 మంది బిష్ణోయీల మహా బలిదానం
- చెట్టును కాపాడేందుకు ప్రాణాన్నే పణంగా పెట్టిన అమృతాదేవి



**అడవి అంటే కేవలం చెట్ల సమూహం కాదు.. అది అనేక జీవులకు ఆవాసం. మనిషికి ప్రాణవాయువు. భూమికి పచ్చని రక్షణ కవచం. వర్షాలకు ఆధారం. జీవ వైవిధ్యానికి నిలయం. అలాంటి అరణ్య సంపదను కాపాడేందుకు కొందరు తమ జీవితాలనే అంకితం చేశారు. మరికొందరు విధి నిర్వహణలో ప్రాణాలనే బలిపెట్టారు. వారి త్యాగాలను స్మరించుకునే సందర్భమే సెప్టెంబర్ 11.. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం.**

భారతదేశం ప్రకృతి ప్రసాదించిన అపారమైన అరణ్య సంపద, జీవ వైవిధ్యం, వన్యప్రాణులతో విశిష్టమైన దేశం. పర్వతాలు, నదులు, పచ్చని చెట్లు, ఔషధ మూలికలు, జంతువులు, పక్షులతో కూడిన అరణ్య వ్యవస్థ మన పర్యావరణ సమతుల్యతకే కాదు.. సాంస్కృతిక వారసత్వానికి, ఆర్థిక వ్యవస్థకు కూడా కీలక ఆధారం. ఈ సంపదను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బందికి నివాళులర్పించేందుకు ఏటా సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

### అడవి కోసం నిత్యం పోరాటమే..

అడవులను కాపాడటం సాధారణ ఉద్యోగం కాదు. ప్రతి అడుగులోనూ సవాళ్లు ఎదురయ్యే కర్తవ్యం. ఫారెస్ట్ గార్డులు, రేంజర్లు, అధికారులు మారుమూల అటవీ ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తుంటారు. వేటగాళ్లు, అక్రమ కలప మాఫియాలు, వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠాలను అడ్డుకునే క్రమంలో ప్రాణహానిని సైతం ఎదుర్కొంటారు. ఎండైనా.. వానైనా.. రాత్రైనా.. పగలైనా అడవే వారి కార్యక్షేత్రం. అగ్నిప్రమాదాలు, వన్యప్రాణుల దాడులు, అక్రమార్కుల బెదిరింపులు వంటి ప్రమాదాల మధ్య విధులు నిర్వహిస్తూ ఎంతోమంది అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వనరక్షకుల త్యాగాలకు దేశం చేసే వందనమే ఈ అమరవీరుల దినోత్సవం.



### ఖేజర్లీ.. చరిత్రలో చెరగని త్యాగం

ఈ దినోత్సవం వెనుక ప్రకృతి పరిరక్షణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహత్తర ఘట్టం ఉంది. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో బిష్ణోయీ సమాజానికి చెందిన ప్రజలు చెట్ల రక్షణ కోసం అసమాన త్యాగం చేశారు. అప్పటి జోధ్‌పూర్ పాలకుడు అభయ్‌సింగ్ అవసరాల కోసం కలప సేకరించేందుకు సైనికులు ఖేజర్లీ గ్రామానికి చేరుకుని చెట్లను నరికేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అమృతాదేవి బిష్ణోయీ చెట్లను నరకకుండా అడ్డుకున్నారు. ప్రాణం పోయినా చెట్టును మాత్రం నరకనివ్వబోనన్న దృఢ సంకల్పంతో ఆమె చెట్టును హత్తుకుని నిలబడ్డారు. ఆమె స్ఫూర్తితో గ్రామంలోని పురుషులు, మహిళలు, పిల్లలు ఒక్కొక్కరు ఒక్కో చెట్టును హత్తుకుని వాటికి రక్షణగా నిలిచారు. ఈ ఘటనలో అమృతాదేవితో పాటు మొత్తం 363 మంది బిష్ణోయీలు ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి కోసం మనిషి ప్రాణాన్నే అర్పించిన ఈ మహా బలిదానం పర్యావరణ పరిరక్షణ చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచిపోయింది.



### ఆ త్యాగానికి గుర్తుగానే..

ఖేజర్లీ అమరవీరుల త్యాగ స్ఫూర్తిని గుర్తుచేస్తూ సెప్టెంబర్ 11కు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. అటవీ సంరక్షణలో విధి నిర్వహణ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బందిని స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2001లో సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ఏటా ఈ రోజున దేశవ్యాప్తంగా అటవీ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నారు. వారి కుటుంబాల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వన సంరక్షణలో అటవీ సిబ్బంది నిర్వహిస్తున్న పాత్రను ప్రజలకు వివరిస్తున్నారు.

### అమరవీరులకు నివాళి.. అడవులపై అవగాహన

అటవీ సిబ్బంది త్యాగాలను గుర్తించడం, వారికి గౌరవం ఇవ్వడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. దాంతోపాటు అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయడం మరో లక్ష్యం. క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బందికి సమాజం అండగా నిలవాల్సిన అవసరాన్ని కూడా ఈ రోజు గుర్తుచేస్తుంది. దేశవ్యాప్తంగా అటవీ అమరవీరుల స్మారకాల వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటారు. విద్యాసంస్థల్లో అరణ్య సంరక్షణ ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు, యువతను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తారు. పలు పర్యావరణ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

### అడవి ఉంటేనే మనుగడ

వాతావరణ మార్పులు, భూతాపం, వర్షాభావం, భూక్షయం, జీవ వైవిధ్యం క్షీణించడం వంటి సవాళ్లు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అడవుల సంరక్షణ మరింత కీలకంగా మారింది. అభివృద్ధి పేరుతో అడవులను విచక్షణారహితంగా నాశనం చేస్తే దాని మూల్యం భవిష్యత్తు తరాలు చెల్లించాల్సి వస్తుంది. చెట్టు నాటడం ఎంత ముఖ్యమో.. ఉన్న చెట్టును కాపాడటం అంతకంటే ముఖ్యం. అటవీ ప్రాంతాలను పరిరక్షించడం కేవలం అటవీ శాఖ బాధ్యతగా భావించకుండా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.

### 363 ప్రాణాలు చెప్పిన పాఠం..

ఖేజర్లీలో 363 మంది చేసిన త్యాగం శతాబ్దాలు గడిచినా మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తోంది. ప్రకృతిని కాపాడటం అంటే మనిషి తన భవిష్యత్తును తానే కాపాడుకోవడం. అదే స్ఫూర్తితో అడవులను రక్షిస్తూ ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరవీరుల త్యాగం కూడా తరతరాలకు మార్గదర్శకం. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం కేవలం నివాళులు అర్పించి వెళ్లిపోయే రోజు కాకూడదు. అడవిని నాశనం చేయనివ్వమని, జీవ వైవిధ్యాన్ని కాపాడతామని, ప్రకృతి సంపదను భావితరాలకు అందిస్తామని సంకల్పించే రోజుగా మారాలి. అడవి మనకు ఇచ్చేది ప్రాణవాయువు.. నీరు.. జీవనం. దానికి ప్రతిగా మనం చేయాల్సింది ఒక్కటే.. దానిని కాపాడటం. ప్రకృతిని రక్షిస్తేనే.. ప్రకృతి మనల్ని రక్షిస్తుంది. అటవీ అమరవీరులకు మనం అర్పించగల నిజమైన నివాళి కూడా అదే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్..!

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఘనవిజయం
- 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు పడిన తెర






చెన్నై వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ చారిత్రక విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను నెట్టివేసి ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఏకంగా 13 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈస్ట్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్.. 708 పరుగులు చేసింది. అనంతరం సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 388/7 వద్ద డిక్లేర్ చేసింది. ఇక మ్యాచ్ ఫలితం తేలేలా కనిపించకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. ఈస్ట్ జోన్ చారిత్రాత్మక విజయంలో ఆ జట్టు కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రధానపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగుల ద్విశతకంతో విరుచుకుపడిన ఇషాన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులతో మెరిశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సౌత్ జోన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు ఆఖరి రోజున యువ బ్యాటర్ మహమ్మద్ కౌనైన్ ఖురైషి అద్భుతమైన సెంచరీతో నాటౌట్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. విజయం సాధించిన తర్వాత ఈస్ట్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఇషాన్ కిషన్, టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీలు చేతిలో వికెట్ స్టంప్‌లు పట్టుకుని గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. పిచ్‌పై డ్యాన్స్ చేస్తూ తమ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఈ విజయం ఈస్ట్ జోన్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైనదిగా నిలిచిపోనుంది. ఈ మ్యాచ్ ఫలితం ఇప్పటికే తేలిపోయినప్పటికీ, సౌత్ జోన్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చూపించిన క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. ఉక్కపోత, తీవ్రమైన అలసట ఉన్నప్పటికీ ఫలితం మారదని తెలిసినా సిరాజ్ వరుసగా 9 ఓవర్లు బౌలింగ్ చేసి తన నిబద్ధతను చాటుకున్నాడు. ఇక సౌత్ జోన్ తరఫున ఒంటరి పోరాటం చేసిన యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు ఇన్నింగ్స్?ల్లోనూ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 80 పరుగులు చేశాడు. అలాగే సౌత్?జోన్?కు కెప్టెన్?గా వ్యవహరించిన తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం ఇషాన్ కిషన్ తమ జట్టు వ్యూహం గురించి వివరించాడు. "జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నప్పుడు ముందుగా పరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మేం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేశాం. దీంతో ఈ మ్యాచ్? ఫలితాన్ని తేల్చేది మొదటి ఇన్నింగ్సే అని మాకు అర్థమైంది. కాబట్టి, ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోర్?కు ఆలౌట్ చేసి లీడ్ సాధించడమే మా లక్ష్యం. అయితే మ్యాచ్?లో విజయం సాధించే విధంగా తొలి ఇన్నింగ్స్?లో మాకు లీడ్ వచ్చింది. దీంతో ఇంతటి తీవ్రమైన ఎండలో మేం మళ్లీ మైదానంలోకి ఎందుకు దిగాలని అనుకుంటాం?" అని ఇషాన్ చెప్పాడు.



# టీమిండియాకు దూరమైన తర్వాత ఆకలి పెరిగింది

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012-13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025-26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.

# అఫ్గాన్, ఆసియా గేమ్స్ భారత జట్టులో మార్పులు

- గాయంతో దూరమైన పేసర్ హర్షిత్ రాణా
- జట్టులో చోటు సంపాదించిన యష్ ఠాకూర్




అఫ్గనిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్, ఆ తర్వాత జరగనున్న ప్రతిష్ఠాత్మక ఆసియా గేమ్స్ కోసం భారత జట్టులో బీసీసీఐ కీలక మార్పు చేసింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్థానంలో విదర్భ పేసర్ యష్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గత జులైలో జింబాబ్వే పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యష్‌కి ఇది రెండో టీ20 సిరీస్ కావడం విశేషం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహ్యాబిలిటేషన్ పొందుతున్న హర్షిత్ రాణాకు మరోసారి తీవ్ర గాయమైంది. సెప్టెంబర్ 7న జరిగిన మ్యాచ్ సిమ్యులేషన్ సందర్భంగా బౌలింగ్ చేస్తుండగా అతడికి రెక్టస్ ఫెమోరిస్ (తొడ ముందు భాగం) కండరం పట్టేసిందని బీసీసీఐ వైద్యాధికారులు ధ్రువీకరించారు. గతంలో తొడపిక్క గాయంతో బాధపడిన రాణా, కోలుకునే క్రమంలోనే ఈ కొత్త గాయం బారిన పడటంతో అఫ్గన్ సిరీస్‌తో పాటు ఆసియా గేమ్స్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడుడొమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ మ-ుస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 18 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు యష్ ఠాకూర్ . ఆపై జింబాబ్వే పర్యటనలో 2 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో కచ్చితమైన యార్కర్లు వేయగల సామర్థ్యం ఉన్న యష్ రాకతో భారత పేస్ విభాగం బలంగా మారింది. సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే అఫ్గన్ సిరీస్ పూర్తయ్యాక, ఆసియా గేమ్స్‌కు ముందు భారత్ ఒక చారిత్రక మ్యాచ్‌లో జపాన్‌తో కూడా తలపడనుంది. మరోవైపు ఫిట్‌నెస్ నిరూపించుకున్న స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లను బీసీసీఐ అప్‌డేటెడ్ స్క్వాడ్‌లోకి అధికారికంగా చేర్చింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత ఆసియా గేమ్స్ జరగనున్నాయి.



# 2027 ప్రపంచకప్ వరకు చూద్దాం

## గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో రోహిత్

2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇదే కార్యక్రమంలో.. 2027 ప్రపంచకప్‌ను భారత్ గెలిస్తే 2024 టీ20 ప్రపంచకప్ విజయోత్సవంలా ముంబైలో బస్ పరేడ్ నిర్వహిస్తారా? అని రోహిత్‌ను అడిగారు. "ఇప్పుడు బస్ పరేడ్ సాధ్యమవుతుందని అనుకోవడం లేదు" అని సరదాగా స్పందించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలో కొట్టిపారేశారు. రోహిత్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు అతడి ఎంపికపై సందేహాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో రోహిత్ 138 పరుగులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఊహాగానాలకు తాను ఆజ్యం పోయనని చెప్పారు.

# ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించిన శీతల్ దేవి




భారత పారా ఆర్చర్ శీతల్ దేవీ మరోసారి సత్తా చాటింది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్నవరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026లో ఆమె స్వర్ణం ముద్దాడింది. కాంపౌండ్ ఈవెంట్‌లో బరిలో దిగిన శీతల్ ఫైనల్?లో కజికిస్థాన్‌కు చెందిన ఐజాదా సీడన్‌తో పోటీపడింది. అయి-ంతే ఇద్దరూ పోటీపోటీగా ఆడడంతో ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో ఇరువురు 144-144తో సమంగా నిలిచారు. అనంతరం ఆట షూట్-ఆఫ్‌కు వెళ్లింది. అక్కడ శీతల్ 10 - 9తో తేడాతో విజయం సాధించి పసిడి పతకం పట్టేసింది. కాగా, వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో శీతల్‌కు ఇదే తొలి వ్యక్తిగత స్వర్ణ పతకం. మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ శీతల్ పతకం ముద్దాడింది. ఆమె తోమన్ కుమార్‌తో కలిసి కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక పోరులో ఈ భారత ద్వయం 157-145 తేడాతో ఇరాక్ జోడీ సారా అల్-హమీద్?ను ఓడించింది. ఇక పారా రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంలో భావన కాంస్యం నెగ్గింది. ఆమె భారత్‌కే చెందిన రాజశ్రీ రాథోడ్‌ను 6- 0 తేడాతో ఓడించి కాంస్య పతకం అందుకుంది. పారా కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో సరిత 141- 140 తేడాతో చైనా షూటర్ వాంగ్ హ్యూటింగ్‌పై నెగ్గి కాంస్య పతకం ముద్దాడింది. పారా కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తోమన్ కుమార్ 143-138 తేడాతో ఇరాక్? పారాఅథ్లెట్ అబ్బాస్ కాధిమ్‌పై నెగ్గి కాంస్య పతకం గెలిచాడు. మరోవైపు, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో రెండుసార్లు పారాలింపిక్స్ మెడల్ విన్నర్ హర్విందర్ సింగ్-భావన 6-0 తేడాతో చైనా జోడీ లియాంగ్ కియురోంగ్-షియా లేపై నెగ్గి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా, ఈ వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026 స్టేజ్ 3ను భారత్ మొత్తం 15 పతకాలతో ముగించింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, మూడు రజతాలు, ఎనిమిది కాంస్యాలు ఉన్నాయి.



# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన

## స్వగత కృష్ణన్ ఇన్స్టాగ్రామ్ పోస్ట్

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన ఇన్స్టాగ్రామ్ స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేరు ప్రస్తావించకుండా ఒక ప్రముఖ సంగీత దర్శకుడిపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సదరు వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ మరియు బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డాడని, అయినా ఇండస్ట్రీ అతని వెంటే నిలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఓ స్టూడియోలో తనకు ఎదురైన లైంగిక వేధింపులు, సౌండ్ ప్రూఫ్ గదిలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన ఉదంతాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ కారణాల వల్లనే తాను చెన్నై వదిలి రుషీకేష్ వెళ్ళినట్లు తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు వ్యక్తికి సినీ పరిశ్రమలో గౌరవం, మద్దతు లభించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అతడు ప్రస్తుతం ఒక భక్తిరస చిత్రానికి సంగీతం అందిస్తున్నాడని, బహిరంగ వేదికలపై సన్మానాలు పొందుతున్నాడని పేర్కొంటూ ఇండస్ట్రీ ఎవరి పక్షాన నిలుస్తోందని ప్రశ్నించారు. "నెక్స్ట్.." అంటూ తన పోస్ట్‌ను ముగించడంతో, త్వరలోనే ఆమె మరిన్ని విషయాలను, ఆధారాలను బయటపెట్టబోతున్నారా అనే ఉత్కంఠ నెటిజన్లలో నెలకొంది.

# అతన్ని ప్రేమించిమోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.



# 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com